క్లుప్తంగా

ఉమామహేశ్వరుడికి వెండి పంచవాళి విరాళం



ఆలయ ఈఓకు వెండి పంచవాళిని విరాళంగా అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామికి గడివేముల మండలం గని గ్రామానికి చెందిన ఎన్ శంకర్ దంపతులు 229 గ్రాముల బరువు కలిగిన పంచవాళిని ఆలయ ఈఓ చంద్రుడుకు విరాళంగా గురువారం అందజేశారు. ఈఓ మాట్లాడుతూ దాత శంకర్ దంపతులు శ్రీశివపార్వతులపై ఉన్న భక్తితో ఈ వెండి పంచవాళిని వితరణగావించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బండి మౌలీశ్వరరెడ్డి, ఆలయ అర్చకుల సిబ్బంది ఉన్నారు.

నైపుణ్య యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రవి

బనగానపల్లె రూరల్ : స్థానిక పొదుపు భవనంలో నైపుణ్య (స్కిల్‌యాప్) యాప్‌పై అవగాహన కార్యక్రమం గురువారం ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ నైపుణ్య యాప్‌లో సచివాయాల ఉద్యోగులు వారికి కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి ఇంటి యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలతో పాటు 17-59 ఏళ్లలోపు వారి మొత్తం వివరాలను నమోదు చేయాలన్నారు. ఈ యాప్ నమోదు చేసిన వివరాలతో భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్కిల్ యాప్‌లో ఏఏ అంశాలు నమోదు చేయాలో వెల్ఫేర్ అసిస్టెంట్ రవి, డిజిటల్ అసిస్టెంట్ హీరానాయక్ వివరించారు.

ఘనంగా సీవీ రామన్ జయంతి



సీవీరామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం రాజయ్య

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నోబెల్ అవార్డు గ్రహీత సీవీ రామన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం రాజయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీవీ రామన్ ప్రతి విషయాన్ని పరిశీలనాత్మక దృష్టితో చూసేవారన్నారు. సముద్రం నీరు నీలంగా ఎందుకు కన్పిస్తుందని పరిశీలించి రామన్‌ఎఫెక్ట్‌ను ప్రపంచానికి అందించి నోబెల్ పురస్కారాన్ని అందుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివశంకర్‌రెడ్డి, శ్రీపతి, జహిరాబీ, నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

ప్యాపిలి: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని డీవైఈఓ సుధాకర్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన ఏనుగుమర్రి, చిన్నపొదిళ్ల పాఠశాలల్లో అపార్ నమోదుపై ఉపాధ్యాయులతో ఎంఈఓ వెంకటేశ్ నాయక్‌తో కలిసిన ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ ప్యాపిలి మండలంలో ఇప్పటి వరకు అపార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ 71 శాతం పూర్తయిందని, ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు.

ఆయాలకు వేతనాలు ఇవ్వాలి

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా విధులు నిర్వహించే కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఏపీ ప్రభుత్వ స్కూల్స్ స్వీపర్స్ అండ్ ఆయా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఆయాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయాలకు గత నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు అన్నారు. అలాగే వారి పై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని, జీవో నంబరు 108 ప్రకారం ఆయాలకు రూ.11,500ల వేతనం, ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న ఏలూరులో నిర్వహించే రాష్ట్ర మహాసభల్లో మహిళా కార్మికులు పెద్ద ఎత్తున్న పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం మండల అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, నాయకురాళ్లు రామసుబ్బమ్మ, మున్ని పాల్గొన్నారు.

మిరపకు కలిసిరాని కాలం

- మిర్చి సాగుపై రైతులకు తగ్గిన ఆసక్తి
- గతేడాది 18వేల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది 8,970 ఎకరాలకే పరిమితం
- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు





కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె సమీపంలో సాగైన మిరప,కోవెలకుంట్ల సమీపంలో గత ఏడాది సాగు చేసిన మిరప స్థానంలో కంది పంట వేసిన దృశ్యం

కోవెలకుంట్ల: గత రెండేళ్ల నుంచి రైతులకు మిరప సాగు కలిసి రావడం లేదు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావంతో మిరప సాగుతో నష్టపోయిన రైతన్నకు ఈ ఏడాది కూడా మిరప అచ్చిరాలేదు. గతంలో ప్రతి ఏటా సాధారణ విస్తీర్ణానికి రెట్టింపు స్థాయిలో మిరప సాగయ్యేది. ఈ ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో సాగు సాధారణ విస్తీర్ణానికి సైతం చేరుకోలేకపోయింది.

అధికారుల అంచనాలు తలకిందులు

నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో 12 వేల ఎకరాలు మిరప సాధారణ సాగు విస్తీర్ణం. మొదట్లో వర్షాలు అనుకూలించడంతో సాగు విస్తీర్ణం గననీయంగా పెరుగుతుందని ఉద్యాన శాఖ అధికారులు భావించారు. ఆయా ప్రాంతాల్లో బోర్లు, బావులు, చెరువులు, ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, కుందూనది, పాలేరు, కుందరవాగు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా సూపర్-10, తేజ, డబ్బీబ్యాడీ రకాలకు చెందిన మిరప సాగు కావాల్సి ఉంది. అయితే రానురాను మిరప సాగుకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తడంతో విస్తీర్ణం తగ్గింది. ఐదు మండలాల పరిధిలో 8,970 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం.

గతేడాది గిట్టుబాటు ధరతో గట్టెక్కిన రైతులు : గతేడాది నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో 18 వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కోత, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్షకు పైగా వెచ్చించారు. వాతావరణం అనుకూలించక వివిధ తెగుళ్ల సోకి దిగుబడులు తగ్గాయి. అయితే ఎకరాకు 20 క్వింటాళ్లలోపే దిగుబడులు వచ్చాయి. మార్కెట్‌లో క్వింటా ఎండు మిరప కాయలు రూ. 22 వేల నుంచి రూ. 24 వేలు ధర పలకడంతో రైతులు గట్టెక్కారు.

మొదట్లో అనుకూలించిన వాతావరణం

గత ఏడాది ఖరీఫ్‌లో మిరప సాగుతో నష్టపోయిన రైతులు ఈ ఏడాది మొదట్లో వాతావరణం అనుకూలంగా మారటంతో మిరప సాగుపై దృష్టి సారించారు. మిరప సాగుకు పొలాలను కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతుండటంతో కౌలు ధర అమాంతం పెరిగింది. మిరప సాగు చేసే పొలం ఎకరాకు రూ. 50 వేల వరకు కౌలు ధర పలికింది. ఆగస్టు మొదటి వారం నుంచి మిరప సాగు కావాల్సి ఉండగా మొదట్లో వర్షాభావంతో సాగునీటి వనరులు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆశించిన స్థాయిలో మిరప సాగు చేయలేకపోయారు. సకాలంలో సాగు నీటి వనరులు అందుబాటులో లేకపోవడం, గతేడాది దిగుబడులు తగ్గడం కూడా ఈ ఏడాది సాగుపై ప్రభావం చూపింది. నియోజకవర్గంలోని ఆయా మండలాల పరిధిలో దాదాపు 8,970 ఎకరాలకు పరిమితమైంది. ఇందులో సంజామల మండలంలో అత్యధికంగా 2,859 ఎకరాల్లో, కోవెలకుంట్ల మండలంలో 1,986 ఎకరాల్లో, అవుకు మండలంలో 1,749 ఎకరాల్లో బనగానపల్లె మండలంలో 1,532 ఎకరాల్లో, కొలిమిగుండ్ల మండలంలో 844 ఎకరాల్లో మిరప సాగైంది. మిరప స్థానంలో ఆయా మండలాల్లో కంది, మినుము, పెసర, మొక్కజొన్న, తదితర పంటలను సాగు చేశారు. రబీ సీజన్‌లో జొన్న, మినుము, పప్పుశనగ, తదితర పంటల సాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

గతేడాది 12 ఎకరాల్లో మిరపసాగు



ఎకరా రూ. 50 వేలు చెల్లించి 12 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని గతేడాది మిరప పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్ష వరకు వెచ్చించాను. వాతావరణం అనుకూలించకపోవడంతో ఎకరాకు 10 క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదు. ఈ ఏడాది మిరప స్థానంలో కందిపంట సాగు చేశాను. – సుధాకర్‌రెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

శనగ పంట సాగు చేశా



గత ఏడాది మిరప సాగుతో తీవ్ర నష్టాలు చవిచూశాను. రెండు ఎకరాల్లో మిరప సాగు చేసి పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. లక్షకు పైగా వెచ్చించగా దిగుబడులు అంతంత మాత్రంగానే వచ్చాయి. ఈ ఏడాది సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా మిరప సాగుకు సాహసం చేయలేకపోయాను. మిరప స్థానంలో శనగ పంట సాగు చేశాను.
– మధుసుధాకర్, ఆకుమల్ల, సంజామల మండలం

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవుకులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అవుకు: క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వినోద్‌కుమార్ అన్నారు. జాతీయ క్యాన్సర్ నివారణ కార్యక్రమంలో భాగంగా ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, అవుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ భవనం నుంచి బస్టాండ్, మార్కెట్, సెంటర్ ప్రధాన కూడల్లో మానవహారంగా ఏర్పడ్డారు. డాక్టర్ మాట్లాడుతూ ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించి, నివారణ చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. వైద్య సిబ్బందితో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి పరీక్షలు నిర్వహిస్తామని, అనుమానిత కేసులను చికిత్స నిమిత్తం పెద్దాసుపత్రులకు తరలిస్తామన్నారు.



బేతంచెర్ల : ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య, వైద్య సిబ్బంది

కార్యక్రమంలో డాక్టర్లు యమునా, నవీన్, హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాలరాజు పాల్గొన్నారు.

క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ

బనగానపల్లె : మండలంలోని టంగుటూరులో క్యాన్సర్‌పై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకరుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ అయ్యమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా వైద్యురాలు మెహతాబ్ సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రూతమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా ముఖ్య అధికారి డాక్టర్ కామేశ్వరరావ్



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ కామేశ్వరరావ్

డోన్ : సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా ముఖ్య అధికారి డాక్టర్ కామేశ్వరరావ్ సూచించారు. పట్టణంలోని పాతపేట, రోకలిబండ సత్రం, వంద పడకల ప్రభుత్వాసుపత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ లాంటి విషజ్వరాలు ప్రబలే అవకాశాలున్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత, కలుషిత నీటి అనర్థాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని ఆశ, ఏఎన్‌ఎంలకు సూచించారు. ఈయన వెంట ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, యూపీహెచ్‌సీ వైద్యులు షబాజ్ హుసేన్, డాక్టర్ మహర్షి, మలేరియా సబ్‌యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

డోన్ : జిల్లా కేంద్రం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాలలో స్కూల్‌గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన జరిగిన జిల్లాస్థాయి కరాటే, బాక్సింగ్, ఉషూ, జూడో పోటీలలో డోన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కరాటే పోటీలలో అనిత, శ్రీలక్ష్మీ, ప్రదితి, ఐశ్వర్య, షభాను, తైబా, బాక్సింగ్‌లో అనిత, శ్రీలక్ష్మి, రజనిలు, ఉషూ పోటీలో రోహిత, జూడోలో రజనీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం మైమున్నిసా తెలిపారు. రాష్ట్రస్థాయి అండర్ 19 కరాటే పోటీలలో వర్షిత, ప్రహల్లిక, స్వాతి, కీర్తనలు ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రతిభ చాటిన విద్యార్థినులను ఫిజికల్ డైరెక్టర్ బాదియమ్మ, కరాటే మాస్టర్ అఫ్రోజ్ బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులతో హెచ్‌ఎం మైమున్నిసా

రేషన్ సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదు

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో తమకు రేషన్ షాపులో కంది బేడలు, చక్కెర ఇవ్వడం లేదని తహసీల్దార్ భారతికి గురువారం ఫిర్యాదు చేశారు. డీలర్‌ను ఈ విషయమై ఎన్నిసార్లు ప్రశ్నించినా సాంకేతిక సమస్య కారణంగా తమకు కంది బేడలు, చక్కెర మంజూరు కావడం లేదన్నట్లు తెలిపారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించి తమకు రావాల్సిన రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయించాలని గ్రామస్తులు రమణయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, కిష్టన్న, సుబ్బయ్య తదితరులు ఫిర్యాదు చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.



నాడు కళకళలాడుతున్న ఈతకొలను

నాడు కళకళ- నేడు వెలవెల

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గ కేంద్రంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్ నిరుపయోగంగా మారింది. క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో యువకులు, బాలురకు ప్రత్యేక ఈత కొలనులను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలుచోట్ల టెన్నిస్, షటిల్ కోర్టులతో పాటు క్రికెట్ కోచింగ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చొరవ చూపారు. ఇందులో భాగంగా ఆధునిక వసతులతో నిర్మించిన ఈత కొలనును కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈతకొలను కేంద్రం మూతపడింది. ఔత్సాహిక స్విమ్మర్లను దృష్టిలో ఉంచుకొని స్విమ్మింగ్ పూల్ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



నేడు వెలవెలబోతున్న దృశ్యం

గుండంలో నేడు కార్తీక వనభోజనాలు

కొలిమిగుండ్ల: కార్తీక మాసం రెండవ శనివారం సందర్భంగా కోర్నపల్లె సమీపంలోని గుండం ఆంజనేయస్వామి ఆలయంలో గొడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. తెల్లవారు జామునే స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం వనభోజనాలు ప్రారంభిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

కొలిమిగుండ్ల: మండలంలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి గురువారం తెలిపారు. మండల వ్యాప్తంగా వంద కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయన్నారు. చాలా చోట్ల గుంతలు ఏర్పడటంతో పాటు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయని చెప్పారు. ప్యాచింగ్ పనులతో పాటు కంపచెట్ల తొలగించేందుకు రూ.35లక్షల మేర నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. త్వరలోనే పనులు మొదలు పెట్టడతామన్నారు.

సాయి బాబాకు ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: స్థానిక కర్నూలు రహదారిలో వెలసిన శిరిడీ సాయిబాబా ఆలయంలో కార్తీక మాసం గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. అలాగే ఆలయం ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

చనుగొండ్లలో గొడవ

అవుకు: మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల మధ్య గురువారం గొడవ జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన చాకలి నాగేషు, వీరన్నలు వారి చెల్లెల్లతో ఆస్తుల విషయంలో గొడవపడ్డారు. దీంతో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

ఆంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదానం

డోన్ : పాతపేట ద్రోణపురి ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల సందర్భంగా చేపట్టిన నిత్యాన్నదాన కార్యక్రమం గురువారం కొనసాగింది. హనుమాన్‌తోపాటు శివ, అయ్యప్ప, భవానీ మాలధారులు నిత్యాన్నదానాన్ని వినియోగించుకోవచ్చునని అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు వనభోజన మహోత్సవం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని శ్రీగాయత్రి పీఠం ప్రాంగణంలో శనివారం వేదమాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన మహోత్సవం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అధ్యక్ష, ఉపాధ్యక్షులు నంద్యాల శంకరశర్మ, కొప్పె శేషావలిశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వతేదీ ఉదయం 7.30గంటలకు ప్రత్యేక పూజలతో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. బ్రాహ్మణ సహీయులు కుటుంబ సమేతంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

11న కలెక్టరేట్ ముట్టడి

డోన్ రూరల్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల11వ తేదీన కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం డోన్ పట్టణంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తామని చెప్పి చేయకపోవడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అబ్బాస్, పుల్లయ్య, సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన 108 అంబులెన్స్ సేవలు



డీజిల్ లేక నిలిచిపోయిన 108 అంబులెన్స్

కోవెలకుంట్ల: మండలంలో గురువారం నుంచి 108 అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయి. 24 గంటలు అందుబాటులో ఉండి ఆపదలో ఉన్న వ్యక్తులను సకాలంలో ఆసుపత్రులలో చేర్పించే అంబులెన్స్ డీజిల్ లేక నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం 108 సిబ్బంది వేతనాలు ఇవ్వడం అటుంచితే కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వైద్యం కోసం ప్రజలు 108కు కాల్ చేయగా సిబ్బంది నుంచి వాహనం బ్రేక్‌డౌన్ అనే సమాధానం రావడంతో ప్రైవేట్ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రుల్లో చేర్పించాల్సి వచ్చింది. సిబ్బందికి నాలుగు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని 108 సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ కృష్ణయ్య, భ్రూణ హత్యల నివారణ కమిటీ సభ్యులు, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం గర్భస్థ పిండ పరీక్ష నివారణ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడమగ నిష్పత్తిలో వ్యత్యాసాలు అధికం అవుతున్నాయని, వీటిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకుని ఆడ శిశువుల మరణాలను నివారించడానికి పాటుపడాలని కోరారు.

విద్యార్థులకు తప్పని తిప్పలు



బురద నీటిని దాటి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

అవుకు:మండల కేంద్రం అవుకు సమీపంలోని మెట్టుపల్లె రహదారిలో ఉన్న ఆదర్శ పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులకు తిప్పలు తప్పటంలేదు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు చాలామంది కాలినడకనే వెళ్తున్నారు. పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న పాలేరు వాగు రహదారి గుంతలమయంగా ఉంటూ, వాగు నుంచి పారే నీరు రోడ్డుపై చేరి బురదమయంగా మారుతోంది. ప్రతిరోజూ విద్యార్థులు ఇబ్బందులు పడుతూ బురద దారిని దాటి పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆ రహదారిలో నిత్యం నీరు పారుతుండటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే యూనిఫామ్‌కి బురద కొట్టుకోవాల్సిందే. గతంలో ఈ సమస్యను ప్రజాప్రతినిధులు మండల్ మీట్‌లో ప్రస్తావించటంతో అధికారులు అరకొరగా పనులు చేసి వదిలేసారు. అంతేకుండా బస్టాండ్ నుంచి పాఠశాలకు వెళ్లాలంటే దాదాపు 2కిలోమీటర్లు ఉంటుంది. అయితే ఉదయం పూట కేవలం ఒక్క బస్సు మాత్రమే విద్యార్థుల కోసం వస్తోంది. అందులో 50 నుంచి 70 మంది విద్యార్థులు మాత్రమే వెళ్లగలరు. మిగతా విద్యార్థుల్లో కొందరు డబ్బులిచ్చి ఆటోల్లో, మరికొంతమంది నడుచుకుంటూ పాఠశాలకు చేరుకుంటున్నారు. విద్యార్థుల ఇబ్బందులు గుర్తించి సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారి పనులను చేపట్టడంతో పాటు, ఉదయం వేళ రెండు బస్సులు తిప్పేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిథిలావస్థలో ఎస్ఆర్‌బీసీ 9వ బ్లాక్ కాలువ



ముళ్లపొదల మధ్య ఎస్ఆర్‌బీసీ 9వ బ్లాక్

బనగానపల్లె : ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వ నుంచి కోవెలకుంట్ల మండలం బిజనేవేముల వరకు సుమారు 9 కిలో మీటర్ల వరకు ఉన్న ఎస్ఆర్‌బీసీ 9వ బ్లాక్ కాల్వకు ఇరువైపుల ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి, కాలువ కుంచించుపోయి నీటి ప్రవాహానికి ఆటకం కలుగుతోంది. ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వవెంట నీటి ప్రవాహం సమృద్ధిగా ఉన్ననూ బ్లాక్‌లు పతనావస్థలో ఉన్నందుననే నీటి వినియోగంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2004లో ఈ కాల్వను ఏర్పాటు చేయగా ప్రస్తుతం పతనావస్థకు చేరింది. ఈ కాల్వకు అనుసంధానంగా మిట్టపల్లి, బనగానపల్లె, కాపులపల్లి, ఇల్లూరు కొత్తపేట, కైప, బిజనేవేముల, అమడాల మరిన్ని గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 9వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. అయితే అక్కడక్కడ ఈ కాల్వకు ఇరువైపుల ఉన్న సిమెంట్ పలకలు పడిపోవడంతో గట్టు కొతకు గురయ్యే అవకాశం ఉంది. బ్లాక్ అనుసంధానంగా ఏర్పాటు చేసిన పంట కాల్వలు కూడా చాల వరకు పూడిక ఏర్పడడం వల్ల ఆయకట్టు సాగునీరు లభించక ఇబ్బంది పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ బ్లాక్‌కు దూరంగా ఉన్న ఆయకట్టుకు సాగునీరందక పంపుసెట్లు ఏర్పాటు చేసుకొని పైపులైన్ ద్వారా పంటలకు నీరు పారించుకుంటున్నారు. ఎస్ఆర్‌బీసీ ఉన్నతాధికారులు నిధులు మంజురు చేసి బ్లాక్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచి ఆయకట్టుకు సాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని వారు కోరుతున్నారు.

సబ్సిడీ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: రబీలో వేరుశనగ సాగు చేసే రైతులు సబ్సిడీ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ గురువారం తెలిపారు. కే6 వేరుశనగ రకం పూర్తి ధర క్వింటాం రూ.9,600 ఉండగా 40 శాతం సబ్సిడీపోను రూ. 5,760 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.